# 3 నుంచి నుమాయిష్

- మాజీ ప్రధాని మన్మోహన్ మరణంతో 2 రోజులు ఆలస్యం
- ప్రవేశ రుసుం రూ.50కి పెంపు
- జనవరి 7న మహిళలకు మాత్రమే ప్రవేశం
- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్న డబుల్ డెక్కర్ బస్సు

సమావేశంలో మాట్లాడుతున్న ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్, చిత్రంలో ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, పబ్లిసిటీ కన్వీనర్లు సురేశ్ కుమార్, డాక్టర్ సురేశ్‌రాజ్

అబిడ్స్, డిసెంబర్ 29: హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏటా జనవరి 1 నుంచి మొదలయ్యే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) ఈసారి కాస్త ఆలస్యంగా ప్రారంభం కానున్నది. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 3 నుంచి నుమాయిష్ మొదలవుతుందని, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎగ్జిబిషన్ సొసైటీ కోశాధికారి డాక్టర్ బి. ప్రభాశంకర్ వెల్లడించారు. ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటినరీ హాల్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈసారి ప్రవేశ రుసుమును రూ.40 నుంచి రూ.50కి పెంచామని, సీనియర్ సిటిజన్ల కోసం వీల్‌చైర్లను అందుబాటులో ఉంచుతున్నామని, జనవరి 7న ఎగ్జిబిషన్‌లో మహిళలకు మాత్రమే ప్రవేశం కల్పిస్తామని వివరించారు. సందర్శకులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించనున్నామని, అందులో భాగంగా 100 సీసీ కెమెరాలను, వాచ్ టవర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. అగ్ని ప్రమాదాల నివారణ కోసం మైదానమంతటా వాటర్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు 2 ఫైరింజన్‌లను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. సందర్శకుల సౌకర్యార్థం ఈసారి ఎగ్జిబిషన్‌లో మినీ ట్రైయిన్‌తోపాటు కొత్తగా అద్దాలతో కూడిన డబుల్ డెక్కర్ బస్సును అందుబాటులోకి తీసుకొస్తున్నామని, దీని టికెట్ ధరను రూ.40గా, మినీ ట్రైయిన్ టికెట్ ధరను రూ.30గా నిర్ణయించామని చెప్పారు. సమావేశంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మోహన్, పబ్లిసిటీ కన్వీనర్లు సురేశ్ కుమార్, డాక్టర్ సురేశ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు

## మద్యం మత్తు.. ఆపై అతివేగం

- డివైడర్‌ను ఢీకొని గాల్లోకి ఎగిరిన కారు
- స్వల్ప గాయాలతో బయటపడిన జంట
- పోలీసులతో దురుసు ప్రవర్తన.. కేసు నమోదు

బంజారాహిల్స్, డిసెంబర్ 29: మద్యం మత్తులో అతివేగంగా కారు నడుపుతూ యాక్సిడెంట్ చేయడంతోపాటు పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన యువజంటపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన తీగళ్ల దయాసాయి రాజ్( 28), స్నేహితురాలితో కలిసి కారులో శనివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో పార్టీకి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత పార్టీ ముగించుకుని జూబ్లీహిల్స్ మీదుగా ఇంటికి బయలుదేరారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.1లోని నందమూరి బాలకృష్ణ ఇంటి సమీపంలోకి రాగానే అతివేగంగా ఉన్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ధాటికి కారు గాల్లోకి ఎగిరి రోడ్డుకు రెండోవైపు పడిపోయింది. ఈ ఘటనలో కారు తుక్కుతుక్కయింది. కాగా.. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో వారిద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకుని వారిని పీఎస్‌కు తీసుకువెళ్లారు. పీఎస్‌కు తీసుకువెళ్తున్న పోలీసులపై వారు బూతులు తిట్టడంతో పాటు దురుసుగా ప్రవర్తించారు. వారికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎన్నడూ ఇలాంటి ఘటన జరగలేదు..

- షోకాజ్ నోటీసులపై స్పందించిన సంధ్య థియేటర్ యాజమాన్యం
- పోలీసులకు 6 పేజీలతో కూడిన వివరణ అందజేత

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్‌కు హైదరాబాద్ పోలీసులు ఇచ్చిన షోకాజ్ నోటీసులపై థియేటర్ యాజమాన్యం స్పందించి సమాధానం ఇచ్చింది. ఈ నెల 4న సంధ్య థియేటర్‌లో పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట చోటుచేసుకొని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి మృతి చెందగా, ఆమె కొడుకు శ్రీతేజ్ తీవ్ర అస్వస్థతకు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్.. సినిమా థియేటర్ యాజమాన్యానికి 15 రోజుల క్రితం షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, సరైన వసతులు లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని, మీ థియేటర్ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదంటూ వివరణ కోరారు. ఇందులో భాగంగానే సినిమా థియేటర్ యాజమాన్యం ఆ నోటీసులకు బదులిస్తూ వివరణ ఇచ్చినట్లు తెలిసింది. 45 ఏళ్లుగా థియేటర్‌ను నడిపిస్తున్నామని, గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోలేదని, పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా థియేటర్‌లో 80 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారని, 4,5వ తేదీలలో థియేటర్‌ను మైత్రి మూవీస్ సంస్థ ఎంగేజ్ చేసుకుందని, గతంలో అనేక సినిమాల రిలీజ్ సందర్భంగా హీరోలు థియేటర్‌లో సినిమాలకు వచ్చిపోయారని, సంధ్య థియేటర్‌లో ఫోర్ వీలర్స్, టూ వీలర్స్‌కు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలున్నాయంటూ 6 పేజీలతో కూడిన వివరణను రాసి, తమ న్యాయవాదుల ద్వారా పోలీసులకు అందించారు.

## అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

మహ్మద్ ఫయాజ్ (ఫైల్)

మలక్‌పేట, డిసెంబర్ 29: అనుమానాస్పద స్థితిలో ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన పింజరి బషీర్ అహ్మద్ కుమారుడు మహ్మద్ ఫయాజ్ (25) పోటీ పరీక్షలకు ప్రిపేర య్యేందుకని రెండేళ్లక్రితం నగరానికి వచ్చి పాత మలక్‌పేట డివిజన్‌లోని వాహెద్‌నగర్ అబూబకర్ మసీదులోని గదిలో ఉంటూ చదువుకుంటున్నాడు. కాగా.. మూడు రోజులుగా గది తెరవకపోవడం, గదిలోనుంచి దుర్వాసన రావడంతో మసీదు నిర్వాహకులు శనివారం రాత్రి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గది తలుపులు తెరిపించి చూడగా పూర్తిగా కుళ్లిపోయిన దశలో ఉన్న ఫయాజ్ మృతదేహం కనిపించింది. ఎస్ఐ భరత్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతునికి మూర్ఛవ్యాధి ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో వైద్యులు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## బైక్ కోసం వెళ్తే.. దొరికిన 30 వాహనాలు

మద్దూరు (కొత్తపల్లి), డిసెంబర్ 29 : బైక్ చోరీకి గురవగా విచారణ చేపట్టేందుకు వచ్చిన పోలీసులకు విస్తుపోయే నిజం వెల్లడైంది. హైదరాబాద్‌లో బైకులను చోరీచేసే ఓ వ్యక్తి నారాయణపేట జిల్లా నిడ్జింతకు చెందిన రాజుతో కలిసి వాటిని విక్రయించాడు. అయితే చైతన్యపురి పరిధిలో బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రంజిత్ అనే వ్యక్తి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను పట్టుకొన్నారు. విచారించగా.. రాజుతో కలిసి విక్రయించినట్లు ఒప్పుకోవడంతో పోలీసులు నిడ్జింత గ్రామానికి వచ్చారు. రాజును అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. మొత్తం 30 చోరీ బైకుల(12 రాయల్ ఎన్‌ఫీల్డ్, 18 వివిధ రకాల ద్విచక్ర వాహనాలు)ను గ్రామంలో విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. వీటిని సీజ్ చేసి హైదరాబాద్‌కు పోలీసులు తరలించారు.

## గుండెపోటుతో బెటాలియన్ కానిస్టేబుల్ మృతి

బాలరాజు(ఫైల్)

జూబ్లీహిల్స్, డిసెంబర్ 29 : యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్ కానిస్టేబుల్ దోసపాటి బాలరాజు (45) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. 2012 బ్యాచ్‌కు చెందిన బాలరాజు బెటాలియన్‌లోని ఆర్మ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అథారిటీ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సెలవుపై స్వస్థలమైన భువనగిరికి వెళ్లాడు. ఇంటివద్ద గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక దవాఖానలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని దవాఖానకు తరలిస్తుండగా అప్పటికే మృతి చెందినట్లు బెటాలియన్ అధికారులు తెలిపారు. బాలరాజు మృతితో బెటాలియన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికురాలు హల్‌చల్

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 29 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఓ ప్రయాణికురాలు హల్‌చల్ చేసింది. శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. ముంబైకి చెందిన అఫ్రినా అనే మహిళ ఫ్యాషన్ డిజనర్‌గా పని చేస్తున్నది. ఇటీవల ముంబై నుంచి హైదరాబాద్ వచ్చిన ఆమె శనివారం రాత్రి తిరుగు ప్రయాణంలో ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో హైదరాబాద్ నుంచి ముంబై వెళ్తుంది. విమానంలోకి ఎక్కిన వెంటనే మద్యం మత్తులో ఉన్న ఆ మహిళ .. కేక్‌లు వేయడంతోపాటు ఇతర ప్రయాణికులను ఇబ్బందులకు గురిస్తున్నది. దీనిపై ఎయిర్‌లైన్స్ సిబ్బంది అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు బోడ అనిల్, మన్నే కుమార్

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

రవీంద్రభారతి, డిసెంబర్ 29: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8,200కోట్లను వెంటనే విడుదల చేయాలని ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బోడ అనిల్, మన్నే కుమార్‌లు అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలపై, అదే విధంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం గురించి పట్టించుకోకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. స్కాలర్‌షిప్‌లు, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. ఫిబ్రవరి 25,26వ తేదీలలో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని, ఈ సభలకు ఆర్ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, ఆర్ఎస్పీ కేరళ ఎంపీ ఎన్‌కే ప్రేమ్ చంద్రన్, ఏఐపీఎస్‌యూ జాతీయ కార్యదర్శి షఫీ ఉల్లా , వివిధ జిల్లాల ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. భవిష్యత్ ఉద్యమకార్యాచరణను రూపొందించుకునేందుకు నూతన ప్రభుత్వ విద్యావిధానంపై కాషాయీకరణకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 25,26లలో సభలను నిజామాబాద్ జిల్లాలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభలకు విద్యార్థులు, మేధావులు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, రాజు, రవిగోపాల్‌సింగ్, ఠాకూర్, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# గోవా కేంద్రంగా ఎన్‌డీపీఎల్ మద్యం సరఫరా

### వాస్కోడిగామా రైలులో రూ.2లక్షల విలువ చేసే మద్యం పట్టివేత

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా గోవా నుంచి రైలులో నగరానికి తీసుకువస్తున్న రూ.2లక్షల విలువ చేసే నాన్‌డ్యూటీ పెయిడ్(ఎన్‌డీపీఎల్) మద్యాన్ని శంషాబాద్ ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్ కథనం ప్రకారం...నూతన సంపత్సర వేడుకల నేపథ్యంలో కొన్ని రోజులుగా గోవా నుంచి నగరానికి పెద్ద ఎత్తున నాన్‌డ్యూటీపెయిడ్ మద్యం సరఫరా జరుగుతోంది. ఈ మేరకు సమాచారం అందుకున్న ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ బృందాలు శంషాబాద్, ఫలక్‌నుమా, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్‌ల వద్ద నిఘా పెట్టి గోవా నుంచి వచ్చే రైళ్లలో సోదాలు జరుపుతున్నారు. ఇందులో భాగంగానే ఆదివారం గోవా నుంచి సికింద్రాబాద్ వస్తున్న వాస్కోడిగామా రైలులో తనిఖీలు చేపట్టగా పలువురి వద్ద రూ.2లక్షల విలువ చేసే 43ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లు లభించాయి. ఈ మేరకు మద్యం బాటిళ్లను సీజ్ చేసి మద్యం సరఫరా చేస్తున్న పలువురికి నోటీసులు జారీ చేశారు. శనివారం మహబూబ్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వచ్చిన వాస్కోడీగామా రైలులో 95ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లు లభించిన విషయం తెలిసిందే. గత రెండు రోజులుగా రైళ్లలో సోదాలు జరుపుతూ పెద్ద ఎత్తున ఎన్‌డీపీఎల్ మద్యం పట్టుకున్న ఏఈఎస్ జీవన్ కిరణ్, ఎస్‌టీఎఫ్ సీఐ సుభాష్‌చందర్, డీటీఎఫ్ సీఐ బాలరాజు, ఎస్‌ఐలు వెంకటేశ్, రవిలను ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి, డీసీ దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ కిషన్‌లు అభినందించారు.

# నివాస ప్రాంతంలో హాస్టల్ వద్దు..!

- ఇరుకు రోడ్డుతో ఇప్పటికే అవస్థలు
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- పోలీసులకు, బల్దియాకు ఫిర్యాదు చేసిన వెంగళరావునగర్ సీనియర్ సిటిజన్స్

వెంగళరావునగర్, డిసెంబర్ 29 : చుట్టూ నివాసాలు.. కుటుంబాలు.. పిల్లాపాపలతో నివసించే చోట హాస్టల్ వద్దు.. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని వెంగళరావునగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్, స్థానికులు వాపోతున్నారు . వెంగళరావునగర్‌కాలనీలోని ఇరుకైన రోడ్డులో హాస్టల్ ఏర్పాటుకు భవన యజమాని యత్నిస్తుండటంతో ఆ ప్రాంతవాసుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అసలే ఇరుకైన రోడ్డు..ఆ రోడ్డుపై వాహనాల పార్కింగ్, అంబులెన్స్, ఫైర్ ఇంజన్‌లు, వాటర్ ట్యాంకర్లు రావాల్సా చాలా ఇబ్బందే. అలాంటి ఈ ప్రాంతంలో మూడంతస్తుల భవనంపైన మరో అంతస్తును నిర్మించి.. హాస్టల్ నిర్వహణ కోసం అద్దెకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా.. వద్దని చెబుతున్నా భవన యజమాని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని వెంగళరావునగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వాపోయారు. లేడీస్ హాస్టల్ ఏర్పాటు చేస్తే ఇక్కడికి పోకిరీలు వచ్చే ప్రమాదం ఉందని..కాలనీ మహిళలు, యువతులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందంటూ మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు, వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యకు, జీహెచ్ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సుల్తానాతో పాటు జోనల్ కమిషనర్‌కు సైతం

కాలనీలో ఇప్పటికే ఇరుకుగా ఉన్న రహదారి

20 మంది సీనియర్ సిటిజన్స్ కలిసి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే డ్రైనేజీ పైపులైన్లు ఓవర్ ఫ్లో సమస్య ఉండగా..ఈ హాస్టల్ ఏర్పాటు చేస్తే మరింత డ్రైనేజీ సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందని వాటర్‌వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులకు సైతం ఫిర్యాదులు చేశారు. ఇరుకైన ఈ ప్రాంతంలో హాస్టల్ ఏర్పాటును అడ్డుకోవాలని.. అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### హాస్టల్‌తో మహిళలకు ఇబ్బంది

ఈ ప్రాంతంలో హాస్టల్ ఏర్పాటు చేస్తే మహిళలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. ఎక్కడెక్కడి నుంచో పోకిరీలు ఇక్కడకు వచ్చే ఆస్కారం ఉంటుంది. తుంటరి కుర్రోళ్లు ఇక్కడికి చేరితే ఇళ్లలోని మహిళలు, యువతులు వరండాలోకి సైతం వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ఈవ్‌టీజర్ల బెడద పెరిగే ప్రమాదం ఉంటుంది. పోకిరీల ఆగడాలు జరగకుండా అడ్డుకునేందుకు పోలీసులు చొరవ చూపాలి.

– జి.బుచ్చిరెడ్డి, వెంగళరావునగర్ కాలనీ

### సమస్యలు మరింత జఠిలమవుతాయి

ఇరుకైన గల్లీ రోడ్డులో హాస్టల్ ఏర్పాటు చేస్తే సమస్యలు మరింత జఠిలమవుతాయి. అసలే అంతంత మాత్రంగా ఉండే సందులో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు రోడ్డులో హాస్టల్ ఏర్పాటు చేస్తే ఆ వాహనాలన్నీ ఈ రోడ్డుపైనే పార్కింగ్ చేస్తారు. అత్యవసరమై దవాఖానకు రోగుల్ని తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌కు కూడా దారి కష్టమవుతుంటే..మళ్లీ ఈ ఇరుకురోడ్డులో హాస్టల్ ఏర్పాటు చేస్తే సర్కస్ ఫీట్ల మాదిరిగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. డ్రైనేజీ సమస్యతో రోడ్డంతా దుర్వాసన వెదజల్లే ఆస్కారం ఉంది. బల్దియా అధికారులు స్పందించి హాస్టల్ ఏర్పాటును అడ్డగించాల్సిన అవసరముంది.

– ఉస్మాన్, వెంగళరావునగర్ కాలనీ

## గండిపేట చెరువులో మృతదేహం లభ్యం

మొయినాబాద్, డిసెంబర్29 : గండిపేట జలాశయంలో గుర్తు తెలియని మృత దేహం లభ్యం అయ్యింది. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం హిమాయత్‌నగర్ సమీపంలోని గండిపేట జలాశయం బ్యాక్ వాటర్‌లో నీళ్లపై కనిపించింది. జలాశయం వైపు వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. అతడి వయస్సు సుమారుగా 40-45 ఏండ్ల ఉంటుంది. అతడి ఒంటిపై రెడ్ కలర్ చెక్స్ షర్ట్ ఉండటంతో పాటు ఎస్‌వీ గేగూప్ పేరుతో నేవి బ్లూ కలర్ బనియన్, గ్రే కలర్ షర్ట్ ఉంది. ఎత్తు 5 అడుగులు ఉన్నాడు. మృతదేహాన్ని నగరంలోని ఉస్మానియా దవాఖాన మార్చూరీకి తరలించారు. మిగతా వివరాల కోసం 9491039043, 9490617188ను సంప్రదించాలని సూచించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

కడ్తాల్, డిసెంబర్ 29: ప్రమాదవశాత్తు ఆటో కింద పడి చిన్నారి మృతి చెందిన ఘటన ఆదివారం తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పుష్పరాజ్ యాదవాసి కొంతకాలం క్రితం కుటుంబ సభ్యులతో కలిసి, మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన జినుకుంట్ల శేఖర్‌యాదవ్ వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం శేఖర్‌యాదవ్‌కు చెందిన పాల డబ్బాలను ఆటోలో ఎక్కించారు. అదే సమయంలో పుష్పరాజ్ కూమార్తె ప్రియాన్సీ (11 నెలలు) ఆడుకుంటూ ఆటోకి కిందకు వెళ్లింది. ఇది గమనించని ఆటో డ్రైవర్ నరేశ్ ఆటోను నడుపడంతో చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు చిన్నారిని చికిత్స నిమిత్తం కడ్తాల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా, అప్పటికే పాప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు జినుకుంట్ల నరేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రియురాలిని దూరం చేశాడనే హత్యకు ప్లాన్

### నలుగురు వ్యక్తులు అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబర్ 29: తనను ప్రియురాలినుంచి దూరం చేసిన వ్యక్తులపై కక్ష తీసుకుందామనే ఉద్దేశంతో హత్యకు ప్లాన్ చేయడంతో పాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి రూ.5లక్షలు డిమాండ్ చేసిన ఘటనలో నలుగురు వ్యక్తులను ఫిలింనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..పారామౌంట్ కాలనీకి చెందిన యాసర్ బమాస్.. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న యువతి(25)తో ప్రేమలో ఉన్నాడు. యువతి కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియడంతో కౌన్సెలింగ్ చేశారు. దాంతో అప్పటినుంచి యాసర్‌ను దూరం పెట్టింది. దీంతో తనను ప్రియురాలినుంచి దూరం చేసిన యువతి సోదరుడిని హత్య చేయాలని నిర్ణయించుకున్న యాసర్.. ఇదే విషయం గురించి స్నేహితులు జైనుల్ అబ్దీన్, అబ్దుల్ హకీంకు చెప్పారు. ఈ వ్యవహారంపై యువతి సోదరుడి ఇంటిపద్దకు వచ్చిన అబ్దీన్, హకీంలు తమకు రూ. 5లక్షలు ఇస్తే కుట్రను మొత్తం బయటపెట్టి ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్న యాసర్ బమాస్‌ను పోలీసులకు అప్పగిస్తామని, లేకుంటే ప్రాణాలు తీయాల్సి ఉంటుందని బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించారు. ఈ వ్యవహారంపై యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువతి సోదరుడి హత్యకు కుట్ర చేసిన యాసర్ బమాస్‌తో పాటు అతడి స్నేహితులు జైనుల్ అబ్దీన్, అబ్దుల్ హకీం, ఎండీ అబ్దుల్ ముక్తార్ యాసర్‌లను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా గతంలో కూడా యువతి కుటుంబ సభ్యులను బెదిరించి వీరు రూ.5లక్షలు వసూలు చేసినట్లు తేలింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**GOLD FINANCE**



★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739.
NT-326616

**CHITS & DEPOSITS**

★Regd. Chits: 5L, 10L, 15L, 20L, 25L, 50L & 1 Crore Chits. Commitment available. Contact: 8464919899.
NT-326882

**OLD AGE HOME**

★వృద్ధులు, NRI's విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి. దీర్ఘకాలిక మంచాన ఉన్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్, ఉప్పల్ & ECIL - కీసర రోడ్, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతితో. సంప్ర: 7981467036, 9391039990.
NT-326901

**PLOT FOR SALE**



★Bhongiri Yellamma Temple Opp. HMDA Villa Plots & Ghatkesar Two HMDA Villas "Low Cost". Cont: 9121830146, 9154270146.
NT-326617

★Farm Plots for Sale: 3000 Per Sq.Yard, Near 400 Acres Govt. Sez, Kalwakurthy, Srisailam Highway. Ph: 7981200477.
NT-326920

★450 Square Yards, 45 Lakhs 45 Months Monthly (1) Lakh (0)% Interest, (0)% Down Payment, DTCP & RERA Approved Final Layout @ Shadnagar. 9949695027.
NT-326927

**WANTED**

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-AII

**CHANGE OF NAME**

★I, KATTI AKSHITHTEJ, S/o. Kathi Mallikarjun, R/o. 8-24/2, New Sai Nagar Colony, Peerzadiguda, Medipally, Medchal-Malkajgiri Dist., TS. Changing My Surname as KATHI AKSHITHTEJ, S/o. Kathi Mallikarjun in all SSC Certificates, Inter Board Certificates and in every Certificates.
NT-326225

★I, BACHUPALLY VAMSHIDHAR REDDY, S/o. Basupally Bhoopal Reddy, R/o. 14-179, Plot No 18, Ganesh Nagar Colony, R N Reddy Nagar Colony, Meerpet, Balapur, K.V. Rangareddy, Telangana, India -500097. I Have changed my name as BASUPALLY VAMSHIDHAR REDDY for all purposes.
NT-337307

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనల